# అర్ధరాత్రి స్వరాజ్యం సిగ్గుపడింది!



"రేపు మార్నింగ్ డ్యూటీ ఉందా ?"

అతని మాటలు సుమిత్రకి వినిపించలేదు.

ఆమె ఎడంచేతిని అతని భుజం మీదవేసి, చెవిదగ్గర నోరుంచి, అతనికి వినబడేట్టుగా...

"ఏమిటన్నారు ?" అనడిగింది.

మొహం వెనక్కి తిప్పి, బిగ్గరగా....

"రేపు డ్యూటీకెళ్ళవా ?" అనడిగాడు శశిధర్.

"ఒంట్లో బద్ధకంగా ఉంది– రేపుడుమ్మా కొట్టేస్తా" అని, నవ్వింది సుమిత్ర.

శశిధర్ కూడా ఆనవ్వుతో శ్రుతి కలిపాడు.

ఎదురుగ్గా లారీ కాటోలు స్పీడుగా వస్తోంది.

శశిధర్ రెండుసార్లు డిమ్ కొట్టాడు.

అయినా, లారీడ్రైవర్ సిగ్నల్ గమనించలేదో, గమనించినా నిర్లక్ష్యం వల్లనో డిమ్ యివ్వకుండానే స్పీడుగా వచ్చేస్తున్నాడు.

శశిధర్ కొంచెం భయపడి, చేతక్‌ను స్లో చేశాడు.

అయినా, లారీవాడు స్పీడు తగ్గించకుండానే, ఎదురుగ్గా మరో వెహికిల్‌వొస్తోందన్న ధ్యాసైనా లేకుండా దూసుకుంటూ వెళ్ళిపోయాడు.

శశిధర్ వాడినోసారి అందరంగా తిట్టి, గ్రిప్‌రెయిజ్ చేశాడు.

"మీకు బాగా ఆకలేస్తున్నట్టుంది... అందుకే కోపంగా ఉన్నారు" అంటూ సుమిత్ర విసిరిన విసురుకు సమాధానంగా అతనో చిరునవ్వు నవ్వుకున్నాడు.

హుషారుతో మరింత జోరందుకుంది చేతక్.

మరో ఫర్లాంగుదూరం వరకూ జనసంచారం ఎక్కువగా ఉండదు.

అక్కడి నుంచి అంతా యిళ్ళూ, అవీనూ.

అక్కడికి శశిధర్ వాళ్ళ క్వార్టర్ ఆరుఫర్లాంగులపైనే ఉంటుంది.

ఊరికి దూరంగా ఉండడం ఒకవిధంగా బాగానే ఉన్నా, అందువల్ల కొన్ని ఇబ్బందులు తప్పడంలేదు....ముఖ్యంగా టౌన్లో ఏదేనా పని ఉన్నా, సినిమా చూడాలన్నా ;

ఆకాశంలో రాత్రిపూట పెద్దదిక్కుగా ఉండే చంద్రుడు ఆవాళెందుకో రాలేదు. చుక్కలు బిక్కుబిక్కుమంటూ దిక్కులు వెదుక్కుంటున్నాయి. ఆ మూలనించి మేఘం కమ్ముకొస్తోంది.

ఆవాళ మొదటి ఆట సినిమా చూసి వాళ్ళిద్దరూ...ఆరేళ్ళ అమ్మాయి శైలజ....రాత్రిపూట ఇంటికి వెడుతున్నారు.

వై. రాంబాబు + శాయి

శశిధర్ సడెన్ బ్రేక్ వేయడంతో సుమిత్ర ఉలిక్కిపడి, ముందుకి జరిగి, శైలజను మరింత గట్టిగా అదుముకుని, పడిపోకుండా జాగ్రత్తపడింది. అంత సడెన్ బ్రేక్ ఎందుకు వేయాల్సి వచ్చిందో అర్థంగాక, కొంచెం వొంగి చూసింది.

రోడ్డుమీద ఎవరో ఇద్దరు అడ్డంగా నిలబడి ఉన్నారు. వాళ్ళని తప్పించుకుని, పక్కగా పోదామనుకున్న శశిధర్‌కి వీలు కాలేదు. ఆ ఇద్దరిలో ఒకడు స్కూటర్ హేండిల్‌బార్ పట్టుకున్నాడు.

అతను బాగా లావుగా ఉన్నాడు.

గళ్ళలుంగి కట్టి, బనియన్ తొడుక్కుని ఉన్నాడు.

శశిధర్ స్కూటర్ ఆపుచేయక తప్పలేదు.

"పింజారీ నా కొడకా! తప్పించుకు పోదామనుకున్నావ్‌రా" అంటూ ఉరిమినట్టు అరిచాడు గళ్ళలుంగీ ఆసామీ :

దూరంగా ఉన్న రెండోవాడు ఒకే అంగలో స్కూటర్ దగ్గరకు చేరుకుని, "ఇంకా దిగవేంచే లంజకానా!" అంటూ సుమిత్రను చేయిపట్టుకుని కిందికి లాగాడు

సుమిత్ర వాడివంక కోపంగా చూసింది.

సన్నగా ఉన్నా, వాడు ఎత్తుగా, బలంగా, భయంకరంగా ఉన్నాడు.

వాడి అరుపుకు శైలజ ఉలిక్కిపడి బేర్‌మంది.

ఆ పిల్లను మరింత దగ్గరగా హత్తుకుని, 'ఎవరండీ వీళ్ళు' అని గొణిగింది సుమిత్ర.

శశిధర్ భయపడ్డట్టున్నాడు— ఏం మాట్లాళ్ళేదు.

సుమిత్ర చటుక్కున శైలజను శశిధర్‌కు అందించింది.

అందించి మెరుపులా - రెండోవాడి దవడపగిలేలా పిడికిలి బిగించికొట్టింది. ఊహించని పరిణామమేమో- వాడు దిమ్మెరబోయి, వెనక్కుతూలి, నిలదొక్కుకోవాలని ప్రయత్నించాడు.

ఈలోగా, సుమిత్ర బలం అంతా కుడికాలిలోకి తెచ్చుకుని, వాడి కాళ్ళమీద ఫెడీమని తన్నడంతో వాడు-

"బాబోయ్!" అని అరుస్తూ పడిపోయాడు.

లావుపాటివాడికి ఏం జరుగుతుందో అప్పటికి అర్థమైంది.

వాడు చేతిలోని స్కూటర్‌ని విడిచేస్తూ-

"దొంగముండా! ఏంటే ఎగిరి తన్నేస్తున్నావ్!" అంటూ ముందుకు రాబోవడం గమనించి, శశిధర్ చటుక్కున చేతక్ హేండిల్‌బార్‌ని ఇటు తిప్పాడు.

ఫ్రంట్‌వీల్ వాడికాలికి తగిలి ముందుకు తూలాడు.

ఇదే అదననుకుని, సుమిత్ర వేళ్ళు బిగించి వాడిమెడ మీద టప్‌మని ఒకటిచ్చింది.

వాడు తలెత్తేలోగా మరొకటి-

ఆ వెంటనే మరోటి-

బాగా తాగేసున్నాడేమో, మెడనరంపై పడ్డదెబ్బలకి వాడు తట్టుకోలేక పోయాడు.

అయినా, బలవంతంగా, తెచ్చిపెట్టుకున్న బలంతో వాడు లేచి నిలబడడానికి ప్రయత్నిస్తుండగా, సుమిత్ర వాడి చెంపలు వాయించేసింది- పిడి గుద్దులతో.

వాడు మరి ఓపిక లేనట్టుగా కుప్పకూలి పోయాడు.

ఈలోగా సన్నపాటివాడు ఇటు దొళ్ళాడు.

సుమిత్ర వాడి నడుంమీద రెండుసార్లు కాలిమడమతో అంటించే సరికి, వాడు కిక్కురు మనకుండా పడిపోయాడు.

ఆమె తలెత్తిచూసే సరికి, ఇద్దరు బీట్ కానిస్టేబుల్సు ఎదురుగా వస్తూ కన్పించారు.

"కానిస్టేబుల్స్" అని అరిచింది సుమిత్ర.

వాళ్ళిద్దరూ ఆగి, ఏం జరిగిందోనని సైకిళ్ళు దిగారు.

"మీరు సమయానికి వచ్చారు. ఎలాట్ ఆఫ్ థాంక్స్! ఈ రౌడీ లిద్దరూ బాగా తాగేసున్నారు. మమ్మల్ని దోచుకోవాలని ఆపు చేయడానికి ప్రయత్నించారు. లక్కీగా మీరు వచ్చారు...." అంటూ చెప్పాడు శశిధర్

కానిస్టేబుల్సు చేతి లాఠీలతో వాళ్ళని రెండు ఉతికే సరికి, వాళ్ళిద్దరూ లేచి నిలబడ్డారు.

"లమ్డీ కొడకల్లారా! మీ కింకేం పని లేదురా! దారిన పడిదోచుకోవడమేనా?" అంటూ ఒక కానిస్టేబిల్ లావుపాటి వాడిని మరో లాఠీదెబ్బ అంటిస్తూ బూతులు ప్రారంభించాడు.

"నడండ్రా... మీ పని ఇక్కడ కాదు" అని, "మీరు కూడారండి సార్! రిపోర్ట్ మీద ఒక సంతకంపడేస్తే...వీళ్ళని లాకప్‌లో పడేస్తాం" అని మరో కానిస్టేబిల్‌తో చెప్పాడు.

"సరే- సరే- మేం స్టేషన్ దగ్గరుంటాం- మీరు వీళ్ళని తీసుకురండి!" అంది సుమిత్ర.

శశిధర్ శైలజని సుమిత్ర కందించి, స్కూటర్ స్టార్టు చేశాడు.

సుమిత్ర ఎక్కి, సర్దుకున్నాకోగాన, అతను గ్రిప్‌రైజ్ చేశాడు,

o o o o

"మేము మీ రక్షణ కోసమే"

ఎదురుగ్గా, గోడమీద పెద్దపెద్ద అక్షరాలు.

సుమిత్ర అది చూసి నవ్వుకుంది.

శైలజను శశిధర్ కందింది, చకచకా మెట్లెక్కి లోపలికి వెళ్ళింది.

హాల్లో గోడమీద దేశానికి స్వాతంత్ర్యం తెచ్చానని బోసి నవ్వుతో, కర్ర పట్టుకుని గాంధీగారు నిలబడున్నారు. స్వతంత్ర భారతంలో అన్నీ సక్రమంగా సరిదిద్దామని కాబోలు, ఇటుపక్క నెహ్రూగారు, అటుపక్క ఆయన పుత్రికారత్నం చక్కగా చిరునవ్వులు నవ్వుతున్నారు.

జనాన్ని రక్షించడం, శాంతిభద్రతలు కాపాడడంకోసం కంకణం కట్టుకొన్న రక్షక భటులు ఆవాళ, ఆ పక్క గదిలో కళ్ళెరుపెక్కి ఉన్నారు.

ముందున్న మందుబాటిల్ దాదాపు ఖాళీ అయింది.

ఎదురుగా సబ్‌ఇన్‌స్పెక్టర్ కళ్లు అరమూతలుగా ఉన్నాయి.

అటూ, ఇటూ కూచున్న ఇద్దరు కానిస్టేబుల్స్ కూడా దాదాపు అదే స్థితిలో ఉన్నారు.

సగం సగం తాగినగ్లాసులు మూడూమత్తుగా చూస్తున్నాయి.

తాగిన వాళ్ళని-

తప్పుచేసిన వాళ్ళని-

జూదాలాడే వాళ్ళని-

ఆవేశంతో మానవత్వాన్ని మరిచిపోయిన వాళ్ళని–
జేబుదొంగలని–
చీకట్లో అవినీతి ముద్దులాడే వాళ్ళ –
పీడపురుగులై సంఘాన్ని చీకాకు రిచే వాళ్ళని–
పెద్ద వాళ్ళనందరినీ దండించి, సమాజంలోని శాంతి భద్రతలు కాపాడవలసిన పోలీసులు మైమ ని, మత్తిల్లి ఉన్నారు.
ఖాకీ దుస్తులుకై పెక్కి ఉన్నాయి
సుమిత్ర కళ్ళనుందర ఆ దృశ్యం సినిమాలో మాదిరిగా ఉంది.
రాకూడని వేళ వచ్చానా అనుకు వెనక్కి తిరిగింది సుమిత్ర.
చప్పుడైతే, తలెత్తి చూసి, చటుక న లేచి ఆమెను రెండు చేతులా వాటేశాడు సబ్ఇన్‌స్పెక్టర్.
"వాట్ ఎ బ్యూటీ! అప్సరస దిగి వచ్చినట్టుంది– సమయానికి వచ్చావే సారాబుడ్డీ!" అంటూ సుమిత్ర పైట చెంగు పట్టుకుని లాగేడు.
సుమిత్రకు చర్రుమంది.
చెంప చెళ్ళుమనిపించింది.
ఖాకీ చేతులు కరుగ్గా ఉంటాయి.
పడితే– అది భల్లూకప్పట్టే!
ఇద్దరు కానిస్టేబిల్సూ ఇంచక్కా నవ్వుకుని, తలుపులు మూసేశారు.
ఎంతైనా సుమిత్ర.
గింజుకుంది.
రక్కింది.
కరిచింది.






తన కాయశక్తులా తప్పించుకోవాలని తాపత్రయపడింది.
వాళ్ళు ఆల్కాహాలికులు.
వాళ్ళు కైపులో ఉన్నవారు.
వాళ్ళు కాముకులు.
ఆమె ఎవరైనా కానీ–
అప్పుడు ద్రౌపది చీరలాగింది– ఒక దుశ్శాసనుడు.
ఇప్పుడు ముగ్గురు.
లేడికూన– అదురుతో, బెదురుతో–
చుట్టూ మూడు సింహాలు– భయంకరంగా నవ్వుతో–
ఎర్రగా ఎగరేసిన జండా– వాంఛ!

o o o o

శైలజను తీసుకుని, శశిధర్ కారిడార్‌లో నిలబడి ఉన్నాడు.
సుమిత్ర ఎటు వెళ్ళిందో తెలీలేదు.
అటూ ఇటూ చూస్తున్నాడు.
"ఏం కావాలి?" అనడిగాడో కాన్‌స్టేబుల్, నిద్రకళ్ళతో–
"ఈ దొంగ నాకొడుకుని లాకప్‌లో తోసెయ్!"
అనరిచాడు మరో కాన్‌స్టేబుల్.
వాళ్ళెవ్వరూ దారికాచి దోచుకునే రౌడీలుకాదు.
సమాజ పరిరక్షణకోసం ఖాకీ రంగేసుకున్న సింహాలు.
అయితేనేం!
మనుషుల్లో మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు ఉన్నట్లు ఖాకీ సింహాల్లోనూ మంచివీ, చెడ్డవీ ఉంటాయి.
కానయితే–
ఈ సింహాలు మంచివి కాకపోవడం శశిధర్ పాలిట దురదృష్టం అయింది.
అంతే!
సింహాల్లో ఒకచిన్న కదలిక!
వాటి కళ్ళల్లోకి దేగ చూపులొచ్చేయి.
శైలజ గుక్క పట్టింది.

o o o o

ఏడ్చి ఏడ్చి, మరి ఏడవలేక, సొమ్మసిల్లిపోయినట్లు–
అంతవరకూ కుండపోతగా కురిసిన వర్షం వెలిసింది.
ఆకాశం క్రమంగా తేటవారుతోంది.
వీధిలో వాన నీళ్ళింకా వేగంగా పరుగు పెడుతున్నాయి.
గదిలో నిశ్శబ్దం!
శశిధర్ గుండెల్లో ప్రేలిన అగ్నిపర్వతం ఇంకా చల్లారలేదు.
అతని చూపులో నిర్లిప్తత:
పక్కనే నిద్రలో శైలజ.
ఏడ్చి ఏడ్చి ఏడ్చి ఏడుస్తూనే నిద్రలోకి జారిపోయిన గుర్తుగా పాలబుగ్గలపై కన్నీటి చారికలు:
ఎదురుగా ఏదో వార్తాపత్రిక తరపున వచ్చిన విలేఖరి రామచంద్రం.
"అనూహ్యమైన పరిస్థితుల్లో చనిపోయిన సుమిత్రగారి కేసు పత్రికల్లో, ప్రజల్లో విపరీతమైన సంచలనం కలిగించింది శశిధర్ గారూ! ప్రభుత్వయంత్రాంగం అంతా కదిలింది. దద్దరిల్లింది. హోంమంత్రి స్వయంగా కలిగించుకుని, పోలీస్ కమీషనర్‌కి

ప్రత్యేకమైన ఆదేశాలిచ్చినట్లు నిన్న రాత్రి అత్యవసరంగా జరిపిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో చెప్పారు. ఇప్పటి పరిస్థితి చూస్తుంటే- పోయిన మీ భార్య తిరిగిరాలేగానీ, ఆవిడకు జరిగిన అన్యాయానికి సరైన న్యాయం జరుగుతుందేమో నన్పిస్తోంది. మిమ్మల్నెక్కువ విసిగించను. ఒకే ఒక్క ప్రశ్న......"

రామచంద్రం మాటలకు అంతరాయం కలిగిస్తూ- టెలిఫోన్ మోగసాగింది ట్రింగ్ ట్రింగ్ మంటూ.

యాంత్రికంగా రిసీవర్ ఎత్తాడు శశిధర్.

"హలో !" అవతలి నుంచి బొంగురుగొంతు.

శశిధర్ మూగబొమ్మ !

"హలో ! నేను యస్పీగంభీర్‌ని మాట్లాడుతున్నాను..."

"చెప్పండి !" మర్యాద పలికింది.

"సారీ మిస్టర్ శశిధర్ ! జరగకూడనిది జరిగింది. ఇలా జరిగినందుకు- అయాం రియల్లీ సారీ !"

"ఎవరు విచారించి ఏం ప్రయోజనం ?"

"మిసెస్ సుమిత్రగారు దారుణంగా చనిపోవడం నన్నెంతో కదిలించింది-"

శశిధర్ వింటున్నారు.

"సుమిత్రగారు మా డిపార్టుమెంట్ మనిషే అని తెలిశాక- పోలీసులు పోలీసుల్నే కాల్చుకు తింటే-"

శశిధర్‌కి మాటలు వినబడుతూనే వున్నాయి.

"యస్సైని- కాన్‌స్టేబుల్స్‌ని సస్పెండ్‌చేసి అరెస్టుచేసి రిమాండులో ఉంచాం. మెడికల్ రిపోర్టు నిజాయితీగా, సవ్యంగా ఇవ్వబడింది. కేసుని త్వరలో సెషన్స్ వచ్చేటట్లు చూస్తాం. ఈ దారుణ సంఘటనకు కారకులైన వారందర్నీ ఏవిధమైన దయా దాక్షిణ్యాలూ చూపకుండా తగిన శిక్షపడేట్లు ప్రయత్నిస్తామని మీకు హామీ యిస్తున్నాను. ఈ విధంగానైనా మా డిపార్టుమెంట్‌కు అతి కొద్దిమంది చెడ్డవాళ్ళ మూలకంగా వచ్చిన అపఖ్యాతి పోతుందేమో ప్రయత్నించాలి. ఈసారి సుమిత్రగారికి తప్పకుండా పోలీస్ మెడల్ వస్తుంది..."

శశిధర్‌లో ఒక్కసారిగా పెల్లుబికిన ఉద్రేకపు వెల్లువ-

"ఎందుకు ? సుమిత్ర పోలీసు మనిషయి ఉండీ, ఓ సామాన్య స్త్రీలా వంచించబడి చనిపోయినందుకా ? ఎందుకు చెప్పండి...."

ఇక వినడం ఇష్టంలేక రిసీవర్ క్రెడిల్ చేసి, ప్రక్కనే నిద్రపోతున్న శైలజను మరింత దగ్గరగా జరుపుకున్నాడు శశిధర్

రామచంద్రం వైపు చూసి, విరక్తిగా ఓ నవ్వు నవ్వాడు.

"యస్. పి. గారు- అందర్నీ శిక్షిస్తారట. మరి శైలజకు తల్లి పోషణ ఎలా ?...."

శశిధర్ గొంతుక రుద్ధమయింది.

రామచంద్రానికి ఆ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది.

అయినా తన ఉద్యోగధర్మం గుర్తుకొచ్చి ఇరుకుగా ఉన్నట్లు అనుభూతిచెందాడు.

ఇంతలో శశిధర్-

"ఇందాక మీరేమిటో అడుగుతున్నారు ?" అన్నాడు.

"అదే! ఒకటే చిన్న ప్రశ్న....సుమిత్రగారు ఒక సామాన్య స్త్రీ కాకుండా, పోలీస్ డిపార్ట్‌మెంట్ మనిషి కాబట్టే ఇంతకదలిక, ఇంత చురుకు, ఇంతవేగం వచ్చి వ్యవహారాలు కదులుతున్నాయంటారా ?" అనడిగాడు రామచంద్రం.

శశిధర్ కంటిముందు-

సుమిత్ర ఇద్దరు రౌడీలను ఎగిరి తంతోంది.

ఈలోగా ఖాకీ రంగు మేఘం ఖాకీ రంగులాకాక- నల్లగా- చిక్కని చీకటిలా- ఘోరంగా- భయంకరంగా కమ్ముకుంటోంది.

కళ్ళు జిగేల్మనే మెరుపు!

పెద్ద శబ్దం చేస్తూ పిడుగు!

సుమిత్ర అసహాయంగా కుప్పలా కూలిపోయిన దృశ్యం.

అతను లేచి, కిటికీ దగ్గరనిలబడి, బయటికి చూస్తున్నాడు.

అతని కళ్ళల్లో జడివాన.

అతని పెదవులు అస్పష్టంగా కదిలాయి-

"కాదనలేనేమో !" అని.

రామచంద్రం ముఖంలో తళుక్కున మెరిసిన ఓ మెరుపు.

గబగబా చేతిలోని పేడ్ మీద తనురాయబోయే వార్తకి మకుటంరాసుకున్నాడు-

"అర్ధరాత్రి స్వరాజ్యం సిగ్గుపడింది"




Park View Fast Foods

1-2-288/22/9, Domalguda,
Hyderabad-500 029.
Phone : 64323

Dear Sir/Madam

We have pleasure in Introducing The Outdoor Catering Division of Park View Fast Foods, The Professional Caterers with the Personal Touch.

Park View Fast Foods - A Caterer for all Occasions !!!

Call in the Experts for parties from 5 to 500 !!!

Dial - Yourself - A - Party

Our dial yourself a Party service frees you from the hassles of catering for a party.

So call us at 64323 and give yourself a taste of our experience.